సాక్షి సంగారెడ్డి

శుక్రవారం ׀ 29 ׀ నవంబర్ ׀ 2024



చిట్టి బుర్రలు.. గట్టి ఆవిష్కరణలు

పాఠశాల విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు విశేషంగా ఆకట్టుకోవడమేకాక.. ఆలోచింపజేశాయి. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఇన్‌స్పెయిర్, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నూతన ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు కనులవిందుగా సాగాయి.

వివరాలు 8లో ▶



ఎగ్జిబిట్‌లో ప్రాజెక్టును వివరిస్తున్న చిన్నారులు

న్యూస్‌రీల్

రైతు పండుగకు జిల్లా నుంచి 850 మంది రైతులు

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ మండలం అమిస్తాపూర్ శివారులో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే రైతు పండుగ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా నుంచి 850 మంది రైతుల తరలింపు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న అధునాతన పద్ధతులు, యాంత్రీకరణ, నూతన వంగడాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ వర్సిటీల శాస్త్రవేత్తలు, ప్రైవేటు సంస్థల సిబ్బంది ప్రొఫెసర్లు ఆదర్శ రైతులు ఈ కార్యక్రమంలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో వృక్షశాస్త్రం (బోటనీ) బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. బోటనీలో పోస్టు గ్రాడ్యుయేట్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ హిమబిందు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2న కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించారు.

ఫుడ్ పాయిజన్ జరిగితే చర్యలు: డీఈవో



గురుకులంలో తనిఖీ చేస్తున్న డీఈవో

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తప్పవని డీఈవో వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పాఠశాలలు, గురుకులాల్లో వండిపెట్టే భోజనంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆదేశించారు. గురువారం సిర్గాపూర్‌లో కస్తూర్బా పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, నల్లవాగులో గురుకుల పాఠశాలలు తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, భోజనశాల, మరుగుదొడ్లు,తాగునీటి వసతిని, వంట సరుకులను పరిశీలించారు. అనంతరం వసతి గృహంలో ఆహార నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు

వైద్య ఆరోగ్య సంఘం అధ్యక్షుడు భూపాల్



మాట్లాడుతున్న భూపాల్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని వైద్య ఆరోగ్య యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న కార్మికులకు రూ.16 వేలు ప్రభుత్వం ఇస్తున్న, కాంట్రాక్టర్ల ప్రమేయంతో కేవలం రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్మికుల సమస్యలను పట్టించుకోవాలని అనేక ఆందోళనలు చేసినట్లు గుర్తు చేశారు.

ఓటరు జాబితా అవకతవకలపై విచారణ

ఇద్దరు నాయకుల మధ్య వాగ్వాదం

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామపంచాయతీ ఓటర్ లిస్టులో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై సంగారెడ్డి డీఎల్‌పీవో అనిత గురువారం దౌల్తాబాద్ గ్రామపంచాయతీలో విచారణ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొందరు నాయకులు అధికారుల సహకారంతో పలు వార్డుల్లోని ఓటర్లను ఇష్టానుసారంగా మార్చారని విచారణ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 1,336 ఓట్లు మార్పులు జరిగాయని వివరించారు. అంతలోనే కాంగ్రెస్ నాయకులు సాయి కుమార్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్‌గౌడ్ విచారణ అధికారి సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న మరికొందరు ఇరువురికీ సర్ది చెప్పడం వివాదం సద్దుమణిగింది. ఓటర్ల జాబితాలో కొంత మార్పులు చేర్పులు జరిగినట్లు విచారణలో తేలిందని, ఈ విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేయనున్నట్లు అనిత స్పష్టం చేశారు.

తూకం.. పైకంలోనూ కోతే

క్వింటాకు రూ.వెయ్యి కోత

- దళారుల దెబ్బకు పత్తి రైతు చిత్తు
- తక్షణావసరాలకు ప్రైవేటులో విక్రయం
- క్యాష్ చేసుకుంటున్న వ్యాపారులు
- లబోదిబోమంటున్న పత్తి రైతులు



సదాశివపేట మండలంలో పత్తి కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: దళారుల దెబ్బకు పత్తి రైతు చిత్తవుతున్నాడు. ప్రైవేటు కొనుగోలు కేంద్రాలకు వెళ్లొద్దని ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెబుతున్నా నిబంధనల కారణంగా సీసీఐకు విక్రయించలేక రైతుల తక్షణవసరాలు వారిని అటుగా వెళ్లేలా చేస్తున్నాయి. ఇదే అదునుగా వారి అవసరాలను ఆసరాగా చేసుకుని అటు పత్తి తూకంలోనూ, రైతుకు రావాల్సిన పైకంలోనూ కోతలు పెట్టి దళారులు పత్తి రైతును దగా చేస్తున్నారు. అసలే దిగుబడులు సరిగా రాక దిగాలు పడిన పత్తి రైతులకు దళారులు పెడుతున్న కోతలతో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది రైతుల పరిస్థితి.

క్వింటాకు రూ.వెయ్యి వరకు కోత

పత్తికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,520 ఉంది. కానీ తేమ శాతం ఎక్కువగా ఉంటోందని సీసీఐ అధికారులు క్వింటాకు కేవలం రూ.7,300 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇక ప్రైవేటు వ్యాపారుల విషయానికి వస్తే క్వింటాకు రూ.6,500 నుంచి రూ.6,800లకు మించి చెల్లించడం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి బేళ్లకు డిమాండ్ పడిపోయిందని చెప్పి క్వింటాకు రూ.వెయ్యి వరకు కోత పెడుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

తరుగు పేరుతో కిలో కోత..

ధాన్యం మాదిరిగానే పత్తికి కూడా వ్యాపారులు తరుగు తీస్తున్నారు. క్వింటాకు కిలో చొప్పున కోత పెడుతున్నారు. 50 కిలోలు దాటినా కిలో తరుగు ఇవ్వాల్సిందే. ఇలా కిలో తరుగు తీస్తుండటంతో రైతులు క్వింటాకు రూ.70 వరకు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. తరుగు ఇవ్వకపోతే పత్తిని కొనడం లేదని రైతులు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తరుగు ఇవ్వాల్సి వస్తోందని అంటున్నారు.

పడిపోయిన దిగుబడులు..

జిల్లాలో ఈసారి 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. అధిక వర్షాలకు చాలా మట్టుకు పంట దెబ్బతింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పత్తి పంట రంగు మారింది. దీని ప్రభావం దిగుబడిపై పడింది. ఎకరానికి సుమారు 12 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి ఈసారి ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్లకు పడిపోయింది. కొన్ని చోట్ల కొడిపత్తి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణ ఆర్థిక అవసరాల కోసమే..

తక్షణ ఆర్థిక అవసరాల కోసం రైతులు సీసీఐకి కాకుండా, వ్యాపారులకు పత్తిని విక్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారు. ధరలో కోత పెట్టి నిండా ముంచుతున్నారు. సీసీఐకి విక్రయిస్తే పత్తి డబ్బులు పొందాలంటే కనీసం 15 రోజులు పడుతుంది. ఒక్కోసారి 20 రోజులు దాటుతోంది. దీంతో ధర తక్కువైనప్పటికీ వెంటనే డబ్బులు వస్తుండటంతో రైతులు తమకు పండిన పత్తిలో కొంత భాగాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

కూలీలకు కూడా సరిపోవడం లేదు



ఎకరంలో పత్తి సాగు చేసిన. వర్షాలతో పంటంతా దెబ్బతిన్నది. ఎకరం మొత్తానికి 3.64 క్వింటాళ్ల పత్తి వచ్చింది. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. పత్తి ఏరేందుకు కూలీల ఖర్చులే బాగా అవుతున్నాయి. గిట్టుబాటు ధర కూడా రాకపోవడంతో ఈ పంట సాగు చేసి పూర్తిగా నష్టపోయాను. -కుమార్, పత్తిరైతు, సిద్దాపూర్, సదాశివపేట మండలం

కౌలు డబ్బులకు కష్టమవుతోంది



నాకున్న భూమితో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పండించిన. 70 క్వింటాళ్ల వరకు వచ్చింది. చాలా వరకు కొడిపత్తి వచ్చింది. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పండిన పత్తినంతా విక్రయిస్తే కౌలు డబ్బులు చెల్లించడమే కష్టమవుతోంది. -హుస్సేన్, పత్తి రైతు, అంకెనపల్లి, సదాశివపేట మండలం

అధికారులు స్పందించాలి



వాతావరణం అనుకూలించకపోవడంతో ఈసారి పత్తి దిగుబడులు చాలా మట్టుకు పడిపోయాయి. తగిన రేటు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. నిబంధనల కారణంగా సీసీఐకి పత్తిని విక్రయించలేని పరిస్థితుల్లో వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. తూకాల్లో మోసాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. -పృథ్వీరాజ్, మంజీరా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

శరవేగంగా ఆన్‌లైన్ ఎంట్రీ

99.2% పూర్తయిన సమగ్ర సర్వే

- కుటుంబ వివరాలు ఆన్‌లైన్ ఎంట్రీకి పది నిమిషాలు
- 1,934 ఆపరేటర్ల నియామకం
- నెలాఖరుకు పూర్తి చేసేందుకు ప్రణాళిక
- ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదైన 1,37,116 కుటుంబాలు



ఝరాసంగంలో సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో తుది దశలో ఉండగా వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. సర్వేతోపాటు వాటి వివరాలు ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియను ఈ నెలాఖరునాటికి పూర్తిచేసేలా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అందుకోసం ఎప్పటికప్పుడు సర్వే వివరాలను ప్రత్యేకంగా నియమించుకున్న ఆపరేటర్ల ద్వారా ఎంట్రీ చేయిస్తున్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు జిల్లావ్యాప్తంగా 1,934 ఆపరేటర్లను నియమించింది. సర్వే ఆన్‌లైన్ వివరాలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ కంప్యూటర్ ఆపరేటర్లకు ఆదేశాలిస్తున్నారు.

జిల్లాలో 99.2% సర్వే పూర్తి

ఈ నెల 9నుంచి ఇంటింటి సామాజిక, విద్యా, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే కొనసాగుతోంది. సర్వే కూడా తుది దశకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 26 మండలాల్లోని 638 వార్డులలో 2,245 ఎన్యుమరేషన్ బ్లాకులు, 8 మున్సిపాలిటీలలోని 199 వార్డులలో 1,196 ఎన్యుమరేషన్ బ్లాకులుగా గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 99.2% సర్వే పూర్తి అయినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు

పట్టణాలు, గ్రామాల్లో ఎన్యుమరేటర్లు సేకరించిన కుటుంబాల వివరాలు ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీలలో ప్రత్యేక కేంద్రాలతోపాటు కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో సర్వే వివరాల నమోదు కోసం జిల్లావ్యాప్తంగా మొత్తం 1,934 వరకు ఆపరేటర్లను నియమించారు. ఇందులో మండలాల్లో 1,540 మంది, మున్సిపాలిటీలలో 394 మంది ఆపరేటర్లు ఉన్నారు. నమోదు కోసం ఆయా శాఖల కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు ప్రత్యేక ఆపరేటర్లను, ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు 1,37,116 కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. ఈ మేర 34.33% పూర్తి అయ్యింది.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు

సర్వే వివరాల ఆన్‌లైన్ ఎంట్రీని జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వివరాలు తప్పులు లేకుండా పక్కాగా నమోదు చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. ఇప్పటికే ఆపరేటర్లకు సర్వే వివరాలపై శిక్షణను అందించారు. ఒక కుటుంబం సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు 10 నిమిషాల సమయం పడుతోంది. ఒక రోజులో ఒక ఆపరేటర్ 30 నుంచి 40 కుటుంబాల వివరాలు నమోదవుతున్నాయి.

ఈ నెలాఖారుకు పూర్తి చేసేలా...

సర్వే చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను కూడా ఈ నెల 30 వరకు పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికబద్ధంగా సాగుతున్నారు. నమోదు ప్రక్రియ వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేయాలి

- ఆడపిల్లలు అధైర్య పడొద్దు
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి
- కలెక్టర్‌తో కలసి జిల్లాలో పలు వసతి గృహాల తనిఖీ



మల్లెపల్లిలో బాలికల వసతి గృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆకునూరు మురళి

కొండాపూర్(సంగారెడ్డి)/సంగారెడ్డి జోన్‌: చలికాలంను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు వెంటనే దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరు మురళి ఆదేశించారు. ఆడపిల్లలు అధైర్య పడొద్దని వారు మగవారి పిల్లల కంటే ఎందులోనూ తీసిపోరని ఆయన వ్యాఖ్యానించారు. గురువారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా, మండల కేంద్రమైన కొండాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను, కొండాపూర్ మండలం మల్లెపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని, సంగారెడ్డి హాస్టల్ గడ్డలోని ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలసి తనిఖీ చేశారు. కస్తూర్బా పాఠశాల సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టళ్లలో వంట గదులు, స్టోర్ రూమ్‌లు, డైనింగ్ హాలు, మూత్రశాలలో మరుగుదొడ్లు, గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం పెట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సందర్భంగా సంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్‌లో కలెక్టర్, విద్యా కమిషన్ చైర్మన్లు విద్యార్థులతో కలసి రాత్రి భోజనం చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులతో విద్యా కమిషన్ చైర్మన్ మాట్లాడారు..ఉన్నత లక్ష్యం పెట్టుకుని దాన్ని సాధించేవరకు పోటీపడుతూ విద్యపై దృష్టి సారించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత పదవుల్లో ఉన్న ఎంతోమంది అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే అని తెలిపారు. భోజనాల తయారీ కోసం వినియోగించే కారప్పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, గరం మసాలా, సాంబార్ పౌడర్ లాంటి వాటిని ఇక్కడే తయారు చేసుకోవాలని సూచించారు. పది రోజులపాటు అన్ని జిల్లాలలో సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీ పాఠశాలలు, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలి పారు. సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలో అవసరమైన మరమత్తు పనులు చేపట్టాలని సూచించారు. విద్యార్థి సమస్యలపై ప్రభుత్వానికి నివేదికను అందజేసి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారి అఖిలేశ్‌రెడ్డి, డీఈవో అధికారి వెంకటేశ్వర్లు, సంగారెడ్డి తహసీల్దార్ దేవదాస్, వార్డెన్లు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి: కలెక్టర్

పటాన్‌చెరు టౌన్/ హత్నూర (సంగారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి స్పష్టం చేశారు. పటాన్‌చెరు మండల ఇంద్రేశంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతతో ఉండేలా పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

హత్నూర పాఠశాలలో...

గురువారం మండల కేంద్రమైన హత్నూరలోని గురుకుల పాఠశాల, కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.



కిచెన్ షెడ్‌లో నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ క్రాంతి

దరి చేరి... ఆరా తీసి!

- సివిల్స్ ట్రైనీ అధికారుల పర్యటన
- ప్రభుత్వ పథకాల అమలు అభివృద్ధి పనుల పరిశీలన



సివిల్స్ ట్రైనీ అధికారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్, మున్సిపల్ అధికారులు

సదాశివపేట (సంగారెడ్డి): ట్రైనీ సివిల్స్ 11 మంది అధికారులు గురువారం సదాశివపేట మున్సిపల్ పరిధిలో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నారు. మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా ట్రైనీ సివిల్స్ అధికారులతో మున్సిపల్‌లోని కమిషనర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పన్నుల వసూలు, విధుల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు గురించి ట్రైనీ అధికారులకు వివరించారు. అనంతరం మినీట్యాంక్ బండ్ నిర్మాణం చేపట్టిన పనులు, హనుమాన్‌నగర్ కాలనీలోని మిషన్ భగీరథ ట్యాంక్‌ను సందర్శించి పట్టణ ప్రజలకు నీటి సరఫరా గురించి తెలుసుకుని పరిశీలించారు. అనంతరం సిద్దాపూర్‌కాలనీలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ వైద్యుల పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల చదువు గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్ పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్, కమిషనర్ ఉమ, టీపీవో భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

జోగిపేట మున్సిపాలిటీలో...

జోగిపేట(అందోల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు, క్షేత్రస్థాయిలో పరిపాలన విధానాలపై అవగాహనను పెంచుకునేందుకు సివిల్స్ ట్రైనీ అధికారుల బృందం అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో పర్యటించారు. గురువారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న వారిని మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, వైస్‌చైర్మన్ ప్రవీణ్ కుమార్, ఏఈ శ్రీకాంత్‌లు వారికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల పనితీరుకు, మున్సిపాలి టీ పరిపాలనకు ఉన్న తేడాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. వీరితోపాటు మున్సిపల్ అకౌంటెంట్ వెంకటేశ్వరరెడ్డి, టీపీవో విజయలక్ష్మి, మెప్మా టీఎంసీ భిక్షపతి గౌడ్ తదితరులు ఉన్నారు.

మెట్రోపై కుట్ర!

- ఇస్నాపూర్ వరకు నడపాలని కొన్నేళ్లుగా డిమాండ్
- మెట్రో రాకుండా కొంతమంది ప్రయత్నం
- విస్తరణలో తమ షటర్లు లేచిపోతాయని ఆందోళన
- వాటిని కాపాడుకునేందుకు నేతలతో మంతనాలు



పటాన్‌చెరు: హైదరాబాద్ నగరానికి మణిహారంగా చెప్పుకుంటున్న మెట్రో సేవలు జిల్లాలోని పటాన్‌చెరునుంచి ఇస్నాపూర్ వరకూ విస్తరించాలని స్థానికులు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్నారు. మెట్రోతోపాటు జాతీయరహదారి విస్తరణకు కొంతమంది పెద్దలు అడ్డు చెబుతున్నారు. అందుకు కారణం రోడ్డు వెంబడి కేవలం వంద మీటర్ల దూరంలో నెలకొని ఉన్న షటర్లు. మెట్రో, జాతీయ రహదారిని ఇస్నాపూర్ వరకు విస్తరిస్తే తమ షటర్లు శాశ్వతంగా మూతపడిపోతాయనే భయం వాటి యజమానుల్ని వెంటాడుతోంది. అందుకే అటుగా మెట్రోతో పాటుగా జాతీయ రహదారి విస్తరణను తమకున్న రాజకీయ పరిచయాలతో అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా మెట్రోను ముత్తంగి చౌరస్తా వరకూ విస్తరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అడుగడుగునా షటర్లే

పటాన్‌చెరులో ఎక్కడా లేని విధంగా వంద మీటర్ల నిడివిలో కొందరు ప్రముఖుల షటర్లు ఉన్నాయి. అందుకే ఇస్నాపూర్ వరకు మెట్రోను రాకుండా తమ షటర్లు కాపాడుకునేందుకు వారు చేయని ప్రయత్నం లేదు. అటు జాతీయ రహదారి విస్తరణకూ అడ్డు చెప్తున్నారు. ఏవేవో కారణాలు చూపుతు మెట్రోను ఎంపీడీవో కార్యలయం పక్కనే ఉన్న పాఠశాల ప్రాంగణం వరకే పరిమితం చేయాలని షటర్ల యజమానులు కుట్రలు పన్నుతున్నారు. దాదాపు పటాన్‌చెరు వరకు మెట్రోను వేస్తే మూత పడిన అల్విన్ కంపెనీ పక్కన పాఠశాల వరకు మెట్రో ఆగిపోనుంది. వాస్తవానికి మెట్రో రైలు సేవల విస్తరణతో పారిశ్రామికవాడలకు లబ్ధి చేకూరాలనేది స్థానికుల డిమాండ్. అటు పారిశ్రామికవేత్తలు, ఇటు కార్మికులు మెట్రోను ఇస్నాపూర్ వరకు నడపాలని కోరుకుంటున్నారు. అంటే మెట్రో రెండో దశలో నిర్వహించే ప్రాజెక్టును మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు వేయాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. కనీసం ఔటర్ జంక్షన్ ముత్తంగి వరకైనా పొడిగించాలని విశ్లేషకులు డిమాండ్ చేస్తున్నారు. జంక్షన్ వరకు మెట్రో వస్తే ఔటర్ సర్వీస్ రోడ్డు మీదుగా ఇటు తెల్లాపూర్, అటు వైపు సుల్తాన్‌పూర్ పారిశ్రామికవాడ (మెడికల్ డివైజెస్) మరోవైపు పాశమైలారం పారిశ్రామికవాడకు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. హైదరాబాద్‌లోని కార్మికవర్గం పాశమైలారంతో పాటు అటు బాలనగర్ ఇతర పారిశ్రామికవాడలకు సులువుగా వెళ్లి రావచ్చు. దీంతో పారిశ్రామికరంగానికి మేలు జరుగుతుందని పారిశ్రామికవేత్తలు అంటున్నారు. మెట్రోను పటాన్‌చెరు జాతీయ రహదారిపై పాఠశాల వరకే పరిమితం చేయాలని అధికారులపై స్థానిక నేతల నుంచి ఒత్తిడి పెరిగిందని చెప్తున్నారు. పారిశ్రామికవేత్త పొట్టి చందుకుమార్ 'సాక్షి'తో మాట్లాడుతూ...మెట్రో రాకతో పారిశ్రామికవాడలో నెలకొన్న కార్మికుల కొరత తగ్గే అవకాశం ఉందన్నారు.

మెట్రోను ఇస్నాపూర్ వరకు నడపాలి



మెట్రోను ఇస్నాపూర్ వరకు నడిపించాలి. జిల్లా అభివృద్ధికి రైలు మార్గం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉంది. ఎంఎంటీఎస్ కూడా ఆర్సీపురం వరకే పరిమితం చేశారు. అది కూడా పూర్తి స్థాయిలో స్థానికులకు సేవలందించడం లేదు. కనీసం మెట్రోనైనా ఇస్నాపూర్ వరకు నడిపించాలి. -కాసాల సుధాకర్, దిశ కమిటీ సభ్యుడు

అన్ని వర్గాలకు న్యాయం



మెట్రోను ఇస్నాపూర్ వరకు వేయాలి. మెట్రో విస్తరణకు అన్ని వర్గాలు సహకరించాలి. పారిశ్రామికవేత్తలతో పాటు సామాన్య ప్రజలకు మెట్రో సేవలు ఎంతో అవసరం. పట్టణంలో కూరగాయల మార్కెట్ అభివృద్ధి చెందింది. హైదరాబాద్ నలుమూలల నుంచి పటాన్‌చెరు, ఇస్నాపూర్‌కు ఇతర పారిశ్రామికవాడలకు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో వస్తే ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుంది. -బలరాం, బీసీ సంఘం నాయకుడు

క్లుప్తంగా

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల బృందం

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో కంప్యూటర్ సైన్స్, మైక్రోబయాలజీ విభాగాల ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారి సౌజన్యంతో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హైయర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అనే అంశంపై జనవరి 3,4 ల్లో జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్య రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, అంతర్గత నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ సీ.హెచ్ మధుసూదన్, జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి, డాక్టర్ మదన్ మోహన్, కో కన్వీనర్లు డాక్టర్ మహేశ్ కుమార్, డాక్టర్ ఎం. మధుసూదన్ రెడ్డి, గురు చరణ్ దాస్, విభా గాల అధిపతులు డాక్టర్ రాణి, డాక్టర్ ఉమామహేశ్వరి, రోహిణి పాల్గొన్నారు.

ఆటోలో మహిళ ప్రసవం


తల్లీబిడ్డలను పరీక్షిస్తున్న డాక్టర్ రమ్య

ఝరాసంగం(జహీరాబాద్): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పుర్యానాయక్ తండాకు చెందిన బానోత్ స్వప్నకు గురువారం ఇంటి వద్ద పురిటి నొప్పులు వచ్చాయి. భర్త సునీల్ కుటుంబ సభ్యులతో కలిసి తండాలోని ఆటోలో ఝరాసంగం ప్రభుత్వాస్పత్రికి తీసు కొస్తుండగా మార్గమధ్యలో ఆటోలో బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆస్పత్రికి తీసుకొచ్చారు. మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య పరిశీలించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వివరించారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

గజ్వేల్ : చోరీ కేసులో ఇద్దరికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష పడినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆరు నెలల కిందట సింగాటం గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బోదాసు యాదగిరి, ధూల్‌మిట్టకు చెందిన అల్లెపు శేఖర్ దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కేసుకు సంబంధించిన చార్జిషీటును దాఖలు చేయగా గజ్వేల్ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక విచారణ జరిపి ఇద్దరు నేరస్తులకు రెండేళ్ల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఐదేళ్లు ..

కంగ్టి(నారాయణఖేడ్): గంజాయి సాగు కేసులో నిందితుడికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లవడించినట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కంగ్టి మండలంలోని సిద్ధంగిర్గా గ్రామానికి చెందిన రైతు మైల్వార్ బసప్ప వ్యవసాయ భూమిలో 1.12 ఎకరాల్లో 2018 సంవత్సరంలో గంజాయి పంట సాగు చేశాడు. ఈ విషయం స్థానిక వీఆర్వో ద్వారా తెలుసుకున్న పోలీసులు వ్యవసాయ క్షేత్రం పరిశీలించి అప్పటి ఎస్‌హెచ్‌ఓ జీ.నరేశ్ నిందితుడిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు పూర్వపరాలు విన్న ఫస్ట్ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కే.జయంతి గురువారం తీర్పు వెల్లడించినట్ల తెలిపారు. పోలీసు, న్యాయ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పరిశోధనలకు పదును పెట్టాలి

- విద్యార్థులు ఎప్పటికప్పుడూ నూతన ఆవిష్కరణలు చేయాలి
- ఢిల్లీలో వాయు కాలుష్యం భవిష్యత్ తరాలకు హెచ్చరిక
- వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిది
- ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం
- అలరించిన చిన్నారుల నృత్యాలు
- ఆకట్టుకుంటున్న వైజ్ఞానిక ప్రదర్శనలు


ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న విద్యార్థులు


సైన్స్ ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్, తదితరులు


నృత్యం చేస్తున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సిద్దిపేట విద్యార్థినీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పరిశోధనల్లో ఆరోగ్యానికి, అదే విధంగా అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నూతన ఆవిష్కరణలు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శనలను గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉండడానికి పరిశోధనలుండాలన్నారు. వాయు కాలుష్యంతో ఢిల్లీలో పాఠశాలలకు సెలవులు ఇచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందువల్ల కాలుష్యాన్ని తగ్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకురానున్నట్లు తెలిపారు. సాంకేతిక విప్లవం ద్వారా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. నూతన ఆవిష్కరణలు చేయడంలో ఇజ్రాయిల్ ముందంజలో ఉందని, అక్కడ ఉన్న కొద్దిపాటి భూమిలో, నీటి వనరులతో, నూతన వంగడాలతో అధిక ఉత్పత్తి సాధిస్తున్నారన్నారు. వాతావరణ అసమతుల్యం కారణంగా అనేక విపత్తులు వస్తున్నాయన్నారు. అందువల్ల వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడూ నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు.

కాస్మోటిక్ చార్జీలు పెంచాం

అలాగే టెక్నాలజీలో ప్రపంచమే కుగ్రామంగా మారిందని, నూతన ఆవిష్కరణలు అధికంగా వస్తున్నాయన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను, ప్రతిభను, విజ్ఞానాన్ని, ఆవిష్కరణలపై ఇష్టాన్ని మరింతగా పెంచుతాయని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ,బదిలీలు చేపట్టామన్నారు. కుల గణన సర్వేలో ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేశారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గురుకుల, వసతి గృహాలు, పాఠశాలకు కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచామన్నారు. విద్యార్థులకు యూనిఫామ్, షూస్, పాఠ్యపుస్తకాలు సరైన సమయానికి ఇస్తున్నామన్నారు. ఎక్కడో ఒక దగ్గర ఇబ్బంది అయితే ప్రభుత్వం జవాబు చెప్పాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అందువల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలు జరిగితే పాఠశాలల సిబ్బంది బాధ్యత వహించాల్సిందే అన్నారు.

క్రమశిక్షణ లేకుండా ఉంటారా?

కార్యక్రమం ప్రారంభం నుంచి సభా వేదిక వద్ద ఉపాధ్యాయులు గుంపులుగా ఉండటం, సభను ఆటంక పరుస్తూ మాట్లాడుకోవడంతో మంత్రి ఉపాధ్యాయులపై సీరియస్ అయ్యారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాల్సిన ఉపాధ్యాయులే క్రమశిక్షణ తప్పడం సరికాదన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. అంతకు ముందు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సిద్దిపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ విద్యార్థినీలు చేసిన నృత్య ప్రదర్శన అతిథులను, వీక్షకులను ఆకర్షించింది. కలెక్టర్ మను చౌదరి ఆక్సిజన్, హైడ్రోజన్, నైట్రోజన్ ఏ శాస్త్రవేత్తలు కనుగొన్నారో విద్యార్థుల నుంచే సమాధానం రాబట్టారు. నోబెల్ బహుమతి ఏ శాస్త్రవేత్త పేరు మీద ఇస్తున్నామో, ఏ అంశాల్లో ఇస్తున్నామో వివరించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండే విధంగా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

స్టేజీ కింద కూర్చున్న మంత్రి

కార్యక్రమంలో భాగంగా స్టేజీపై వేసిన కుర్చీల్లో కాకుండా మంత్రి వేదిక కిందే కూర్చోవడంతో, కలెక్టర్, ఇతర అధికారులు కూడా మంత్రితోపాటే వేదిక కిందే కూర్చోవాల్సి వచ్చింది. అధిక మంది స్టేజీ ఎక్కడంతో, అతిథులు కాకుండా మిగితా వారు కిందికి దిగాలని ఎన్నిసార్లు మంత్రి, నిర్వాహకులు చెప్పిన వినకపోవడంతో మంత్రి స్టేజీ కిందే కూర్చున్నారు. దీంతో అక్కడికి వచ్చిన వారు ఇది చూసి నివ్వెరపోయారు. సమావేశం పూర్తయ్యే వరకు ఇలానే కూర్చున్నారు. శనివారం వరకు ఎగ్జిబిషన్ కొనసాగనుంది. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

చిట్టి బుర్రలు .. గట్టి ఆవిష్కరణలు

ఈజీ చార్జింగ్ వెహికిల్

వాతావరణ కాలుష్యం తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ వెహికిల్ వాడకానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు చార్జింగ్ అయిపోతే ఇబ్బందవుతుంది. రోడ్డుపైనే వెహికిల్ చార్జింగ్ అయ్యే విధంగా వివిధ రకాల కండక్టర్‌లు ఉపయోగించి వాహనం నడుస్తున్నప్పుడే చార్జింగ్ అయ్యే విధంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రజ్ఞాపూర్ విద్యార్థులు సాయిజ్యోతి, నందిని నూతన ప్రాజెక్ట్‌ను రూపొందించారు.


ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రజ్ఞాపూర్ విద్యార్థినీలు

ఆటోమెటిక్ స్పైక్ సిస్టమ్

పట్టణాల్లో ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు, ముఖ్యంగా జీబ్రా క్రాసింగ్, చౌరస్తాల్లో రెడ్ సిగ్నల్ పడిన కొందరు వాహనదారులు ముందుకు వెళ్తుంటారు. ఇలాంటి వారు సక్రమంగా నిబంధనలు పాటించే విధంగా ఆటోమెటిక్ స్పైక్ సిస్టమ్ ఉపయోగపడుతుంది. సిగ్నల్ పడగానే ముళ్ల కంచెలాంటి పరికరం వాహనాల ముందు ఉంటుంది. వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా ముందుకు కదిలితే వాహనం టైర్‌కు ఇనుప కంచె కుచ్చుకోవడంతో వాహనం టైర్ పంచర్ అవుతుంది. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గైడ్ టీచర్ కృష్ణవేణి సహకారంతో విద్యార్థులు రచన, హరిక ఈ ప్రాజెక్టును రూపొందించారు.


ఆటోమెటిక్ స్పైక్ సిస్టమ్ ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థినీలు


ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


గాజు ముక్కలపై నడుస్తున్న విద్యార్థి

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్


హోటల్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేలా ప్రజలను చైతన్యం చేయాలని మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం ఇతర అధికారులతో కలిసి రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని డంప్‌యార్డును, కూరగాయల మార్కెట్, కార్యాలయాన్ని సందర్శించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేసే విధంగా హోటళ్ల నిర్వాహకులను, దుకాణదారులను, వ్యాపారులను చైతన్యపర్చారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేసే ప్రక్రియను మున్సిపల్ సిబ్బందికి డంప్‌యార్డు వద్ద జాయింట్ డైరెక్టర్‌తోపాటు సీడీవో హేమలత అవగాహన కల్పించారు. అనంతరం అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. డంప్‌యార్డు వద్ద అసంపూర్తిగా ఉన్న ఏఆర్‌సీ సెంటర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, విద్యుద్దీకరణ, బోరు తవ్వకం పనులను 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాలని ఆదేశించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

హైనా దాడిలో 15 జీవాలు మృత్యువాత

చిన్నకోడూరు(సిద్దిపేట): హైనా దాడిలో జీవాలు మృత్యువాత పడిన ఘటన మండల పరిధిలోని మాచాపూర్‌లో గురువారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఆసర్ల కొమురయ్య జీవాలను(గొర్రెలు) రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద కొట్టంలోకి పంపి ఇంటికొచ్చాడు. గురువారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లగా 15 గొర్రెలు మృతి చెంది కనిపించాయి. ఈ విషయమై ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ అక్కడకు చేరుకొని పరిశీలించారు.

అంబులెన్స్ ఇప్పించండి

నటుడు సోనూసూద్‌ను కలిసిన తండావాసి


సోనూసూద్‌తో రాజేశ్ రాథోడ్

మద్దూరు(హుస్నాబాద్): ప్రముఖ సినీ నటుడు సోనూసూద్‌ను గురువారం హైదరాబాద్‌లో కలిసినట్లు ధూళ్మిట్ట మండలం దుబ్బతండా పరిధిలోని చెలిమి తండాకు చెందిన రాజేశ్ రాథోడ్ తెలిపారు. దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని చెలిమితండాలో ఆస్పత్రి లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, తమకు అంబులెన్స్ కావాలని సోనూసూద్‌ని కోరినట్లు తెలిపారు. అంబులెన్స్ మెయింటెన్స్ ఎవరు చూస్తారని అడుగగా గ్రామ పంచాయతీ మెయింటెన్స్ చేస్తుందని తెలిపామన్నారు. గ్రామ పంచాయతీ నుంచి మెయింటెన్స్ అనుమతి పేపర్లు తీసుకురాగానే నెల రోజుల్లో అంబులెన్స్ ఇస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం


ఎగిసిపడుతున్న మంటలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కాజిపల్లి పారిశ్రామిక వాడలోని ఆరోరా లైఫ్ సైన్స్ పరిశ్రమలు గురువారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా పరిశ్రమలోని ఎంబీ బ్లాక్ (2) లో రియాక్టర్ పేలి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన పరిశ్రమ యాజమాన్యం స్థానిక హెటిరో పరిశ్రమ ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. భారీగా ఆస్తి నష్టం ఉండవచ్చని తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రామచంద్రాపురం(పటాన్ చెరు) : ఎస్జీఎఫ్ఐ 68వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు భెల్ కాలనీ భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అక్టోబర్ నెలలో కందిలోని డీపీఎస్ స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి హాకీ అండర్ 14 విభాగంలో విద్యార్థులు తడుక సాయి నిశాంత్, ప్రసాద్, జ్యోతిర్మయి, నిఖిత, దేవ హర్షిని, అక్షయ సత్తా చాటారు. హుజూరాబాద్‌లో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, హెడ్ మిస్సెస్ భాను నిర్మల అభినందించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో

పటాన్‌చెరు టౌన్ : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామానికి చెందిన నగేశ్(34) కూలీ పని చేసుకుంటూ భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకునేవాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై జీవితంపై విరక్తి చెంది 27న ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి బైపాస్ రోడ్డుకు చెందిన రాజుల క్రిష్ణ(44) పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో భార్యతో కలిసి ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ విషయంలో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరిగా ఉన్న క్రిష్ణ 27న ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై హత్యాయత్నం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం మండల పరిధిలోని పెద్దాపూర్ శివారులో చోటు చేసుకుంది. సదాశివపేట ఎస్ఐ నగేశ్ కథనం మేరకు.. కొండాపూర్ మండలంలోని తొగర్‌పల్లి గ్రామానికి చెందిన ఉమ్మనల్ల సత్యనారాయణ(38) ఇంటి నుంచి 27 బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం పెద్దాపూర్ గ్రామ శివారులోని టీజీఐఐసీకి చెందిన స్థలంలోని వేప చెట్టు కింద తలకు, ముఖం ఇతర భాగాలకు తీవ్ర గాయాలై పడి ఉన్నాడు. అయితే, పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చూసి సత్యనారాయణ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేయగా తల్లిదండ్రులు గుర్తుపట్టి ఘటనా స్థలానికి వెళ్లి చూడగా చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ కనిపించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కేసులు


మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

- జోగిపేట సీఐ అనిల్‌కుమార్
- చింతకుంట ఘటనలో ఏడుగురు అరెస్ట్

వట్‌పల్లి(అందోల్): గ్రామాల్లో జరిగే క్రిమినల్ కేసులకు సంబంధించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పంచాయితీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు. గురువారం జోగిపేట సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చింతకుంట గ్రామంలో ఆటో ఎత్తుకెళ్లినందుకు రూ.5 లక్షల జరిమానా కట్టాలంటూ శ్యామ్ కుటుంబీకులపై స్థానిక పెద్దలు ఒత్తిడి తేవడంతో పరువు పోయిందని తల్లి, కుమారుడు మంజీరాలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి మృతురాలి భర్త యాదయ్య ఫిర్యాదు మేరకు గ్రామస్తులు మౌలాన, చాంద్‌పాషా, మహబుబ్‌అలీ, అస్లాం, శ్రీను, శ్రీశైలం, ఆంజనేయులపైన కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్ఐ పాండు, ఏఎస్ఐ అంజయ్య, కానిస్టేబుల్లు నర్సింగ్‌రావు, కిషన్ పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమానికి 15 ఏళ్లు

- ఉద్యమ స్ఫూర్తిని నింపిన సిద్దిపేట
- 1,144 రోజుల పాటు పాలమాకులలో రిలే దీక్షలు
- ఉద్యమానికి ఊతమిచ్చిన నంగునూరు


పాలమాకులలో దీక్షలో మహిళలు (ఫైల్)


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కేసీఆర్ (ఫైల్)

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని గులాబీ దళాధిపతి ఇచ్చిన పిలుపుతో ప్రజల్లో ఉద్యమ జ్వాల రగిలింది. ఆమరణ దీక్ష కోసం కరీంనగర్ నుంచి వస్తున్న కేసీఆర్‌ను అలుగునూర్ వద్ద 2009 నవంబర్ 29న పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ప్రజల్లో ఆగ్రహ జ్వాల రగిలింది. శాంతి మార్గంలో పోరాటం చేయాలని అధినేత ఇచ్చిన పిలుపుతో సిద్దిపేట, నంగునూరు మండలం పాలమాకులలో ప్రజలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నేడు దీక్షా దివస్ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

–నంగునూరు(సిద్దిపేట):

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష, ఉద్యమానికి నంగునూరు మండలంలోనే తొలి బీజం పడింది. ప్రజా ఉద్యమంతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమని నమ్మిన గులాబీ దళాధిపతి కేసీఆర్ 2001లో తెలుగుదేశం పార్టీ, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. తన సెంటిమెంట్ ఆలయం నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి హైదరాబాద్‌లోని జలదృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపిస్తున్నట్లు ప్రకటించారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేశారు. ఇందులో భాగంగా అధినేత ఇచ్చిన పిలుపు మేరకు నంగునూరు మండలంలో ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు, బతుకమ్మ ఆట, బోనాలు, పీర్లతో నిరసన తెలుపుతూ ఉద్యమానికి దన్నుగా నిలిచారు. ఈ క్రమంలోనే కేసీఆర్ ఆమరణ దీక్ష భగ్నం కావడంతో శాంతియుతంగా పోరాటం చేయాలనే సంకల్పంతో సిద్దిపేట తోపాటు పాలమాకులలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మండలం లోని అన్ని గ్రామాల నుంచి మహిళలు, వృద్ధులు తరలివచ్చి ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించే వరకు అలుపెరుగని పోరాటం చేస్తూ 1,144 రోజుల పాటు దీక్షలు చేశారు.

సాయం కోసం ఎదురుచూపు


పద్మయ్య

దుబ్బాక : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం తీవ్ర తరమైన తరుణంలో 2009 నవబంర్ 29 న సిద్దిపేటలో జరిగిన దీక్ష దివస్ సభలో గుండెనొప్పి వచ్చి పడిపోతే ఆస్పత్రిలో వేసి చేతులు దులుపుకున్నారే తప్ప బీఆర్ఎస్ పార్టీ తనకు నయాపైస సాయం చేయలేదని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి కి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు పర్స పద్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం దుబ్బాకలో ఆయన సాక్షితో తన గోడును వెల్లబుచ్చుకున్నారు. సిద్దిపేటలో దీక్ష దీవస్ వేదికపైనే గుండెపోటు వచ్చి పడిపోతే దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావులే స్వయంగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించారని గుర్తుచేశారు. పార్టీ నుంచి సాయం చేస్తామని ప్రకటించారే తప్ప నయాపైస కూడా సాయం అందలేదని వాపోయారు. 2016 లో నాకు బోన్ క్యాన్సర్ రాగా ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి డబ్బులు లేక బీఆర్ఎస్ పెద్దల వద్దకు వెళ్లి నా గోడు వెల్లబోసుకున్నా పట్టించుకోలేరు.. పార్టీ కోసం ఇల్లు జాగలు అమ్ముకున్నా ఇప్పుడు మందులు కొనేందుకు కూడ డబ్బులు లేవంటు కన్నీరుపెట్టారు.

నేడు పెద్ద ఎత్తున వేడుకలు


దీక్ష చేపట్టిన హరీశ్ రావు(ఫైల్)

సిద్దిపేటజోన్ :తెలంగాణ మలి ఉద్యమాన్ని మలుపు తిప్పిన దీక్షలకు స్ఫూర్తితో చేపట్టిన దీక్షా దివాస్‌కు సరిగ్గా 15 ఏళ్లు. కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే క్రమంలో కేసీఆర్ రంగదాంపల్లి వద్ద దీక్షకు సిద్ధం, పోలీసుల అరెస్ట్. ఖమ్మం తరలింపు. కేసీఆర్‌కు బదులుగా హరీశ్ రావు దీక్ష, పోలీసుల లాఠీచార్జి, దీక్ష భగ్నం. సిద్దిపేట, నంగనూర్ ప్రాంతాల్లో వందల రోజుల కొద్ది దీక్షల నిర్వహణ, తదితర పరిణామాలు జరిగిన సిద్దిపేట ఉద్యమంలో చారిత్రాత్మకతను సాధించింది. నాటి నుంచి నేటి వరకు ప్రతీయేటా పార్టీ ఆధ్వర్యంలో దీక్షా దివాస్ వేడుకలు జరుగుతున్నాయి. శుక్రవారం సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయంలో పెద్ద ఎత్తున వేడుకలు చేయాలని నిర్ణయించారు ఎమ్మెల్యేలు హరీశ్ రావు, ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శ్రీనివాస్, యాదవ రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.